గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి


అనిగండ్లపాడులో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

కంచికచర్ల : యోగాతో మంచి ఆరోగ్యం ఉంటుందని, శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ ముందుగా అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం గురించి వివరించారు. శాంతియుత జీవనం కోసం గాంధీజీ, నెల్సన్ మండేలా, మదర్‌థెరిస్సా, దలైలామా ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రపంచ జీర్ణ ఆరోగ్య దినోత్సవం విషయాలను వైద్యులు మధురిమ తెలియజేశారు. విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు కథలతో పాటు డ్యాన్స్‌లు, యోగా నేర్పించారు. కార్యక్రమంలో నీలం సర్వేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణ తరగతులు గ్రంథాలయాల్లో ఉత్సాహంగా జరుగుతున్నాయి. శిక్షణలో భాగంగా సోమవారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతికథలు చెప్పించారు. పుస్తక పఠనం వలన కలిగే లాభాలను వివరించారు.

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ అన్నారు. సోమవారం గ్రంథాలయంలో దేశ నాయకుల పుస్తక పఠనం చేయించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్ ఇంగ్లిష్ హ్యాండ్ రైటింగ్‌లో నైపుణ్యాలను నేర్పించారు. పట్టణానికి చెందిన శ్రీ సాయినటరాజ డ్యాన్స్ అకాడమీ భారతీదేవి విద్యార్థులకు కూచిపూడి నృత్యం నేర్పారు. గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం

మోగులూరు(కంచికచర్ల): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయని మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు బంకా నెహేమ్యా అన్నారు. మండలంలోని మోగులూరులో దైవ స్వరూపి, గుడ్‌విల్ ట్రస్ట్ సంయుక్త సహకారంతో సోమవారం మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ప్రారంభించారు. 45 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. గుడ్‌విల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గోనా వినోష్ శిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తారని తెలిపారు.

ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి

ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: 'స్పందన' ద్వారా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపిస్తున్నామని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన 6 అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీలు వెంటనే సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సిమెంట్ రోడ్డుపై గోడ నిర్మాణం అడ్డగింత

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని సిమెంట్ రోడ్డుపై అక్రమంగా చేపడుతున్న గోడ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. గ్రామంలోని ఏడో వార్డులో సిమెంట్ రోడ్డులో మారోజు రమణ అనే మహిళ అడ్డంగా గోడ నిర్మాణం చేపడుతుంది. దీంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, సచివాలయ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సిమెంట్ రోడ్డుపై గోడ నిర్మాణం చేపట్టకూడదని ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించరాదని సూచించారు. దీంతో సిమెంట్ రోడ్డు వేసిన స్థలం తమదంటూ రమణ వాగ్వాదానికి దిగింది. రోడ్డుపై నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జయచంద్ర హెచ్చరించారు. అధికారులు గోడను తొలగించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రమాదేవి, జీఎంఎ స్కే స్వప్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మౌనిక, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు సీఎం కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- చెన్నారావుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం


చెన్నారావుపాలెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చెన్నారావుపాలెం(వీరులపాడు): నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. పథకాల వివరాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కానీ ఏ ప్రజాప్రతినిధి కానీ మేం ఇది చేశామని చెప్పుకుంటూ ప్రజల ముందుకు వెళ్లిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముందుకు సగర్వంగా వెళ్తున్నామని కొనియాడారు. చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. రాష్ట్రం మొత్తం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనే కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి మద్దతు పలకాలని ఆయన కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జున రావు, బండి సునీత, పలువురు నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి


మాట్లాడుతున్న చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి

నందిగామ: ప్రజల ఆకాంక్షకు తగినట్లుగా పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11:00కు ప్రారంభించారు. ఈ సమావేశంలో 29 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. కమిషనర్ డాక్టర్ జయరాం కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు లెక్కలతో వివరంగా సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. వేసవికాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక అభిషేకాలు

నందిగామ: పట్టణంలోని చెరువు బజార్‌లో షిరిడి సాయిబాబా మందిరంలో 22వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం బాబాకు పలు రకాల ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సహస్ర పుష్పార్చన, పల్లకి సేవ, గ్రామోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లెపూల అలంకరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలోని యాదవబజారులో ముత్యాలమ్మవారిని సోమవారం మల్లెపూలతో అలంకరించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కెపొన్నవరం(పెనుగంచిప్రోలు): ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కె పొన్నవరం గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఈ పథకం నిర్వహిస్తోందన్నారు. పనిచేసిన వారికి వేతనం కూడా వెంటనే అందిస్తోందన్నారు. అడిగిన ప్రతివారికి జాబ్‌కార్డు ఇచ్చి పని కల్పించటం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ అరుణకుమార్
- శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన


శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానవాటిక భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా శ్మశానవాటికలు లేని గ్రామాల్లో స్థలాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అరుణకుమార్ తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించటంతో పాటు వ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాము, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, దాసు, అలీషా, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన


బైక్ ర్యాలీలో సామినేని వెంకటకృష్ణప్రసాద్, పార్టీ శ్రేణులు

జగ్గయ్యపేట అర్బన్: పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే సహించలేని చంద్రబాబు అండ్‌కో అడుగడుగున ఆటంకాలు కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. అమరావతిలో 50 వేలకు పైగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తే చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశానవాటికతో పోలుస్తూ అవమానించడాన్ని నిరశిస్తూ సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసం నుంచి యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసనగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి చంద్రబాబు విషం కక్కుతున్నాయన్నారు. రాజధానిలో ఒకేసారి 50 వేలకు పైగా ఇళ్ల స్థలాలు పేదలకు అందిస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలంతా జగనన్నకు జేజేలు పలకడం చూసి వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. చంద్రబాబు ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేస్తూ ఆటంకాలు కల్పిస్తున్నాడన్నారు. ఇదంతా పేదలు గమనిస్తున్నారని, రాబోయేరోజుల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పటానికి ఎదురుచూస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, నూకల సాంబ, కాశి కిషోర్, దువ్వల రామకృష్ణ, పూసాల పుల్లారావు, డేవిడ్ రాజు, కాటగాని నరసింహారావు, కోఆప్షన్‌సభ్యుడు ఖాదర్‌బాబు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు చారుగుండ్ల కొండ, గోగుల వెంకయ్య, సొసైటీ అధ్యక్షుడు సామినేని లక్ష్మీనారాయణ, గెల్లా పూర్ణచంద్రరావు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ మెకానిక్ ఆత్మహత్య

నందిగామ: పట్టణానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ ఒకరు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. ఏఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. పట్టణంలోని చెరువు బజార్‌కు చెందిన పారా కిరణ్ (42) ట్రాక్టర్ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేసవి సెలవులు కావడంతో భార్యాపిల్లలు ఊరు వెళ్లారు. ఆదివారం రాత్రి యథావిధిగా కిరణ్ ఇంటికి వచ్చాడు. ఊరు వెళ్లిన భార్య ఉదయం ఫోన్ చేసినప్పటికీ కిరణ్ లిఫ్ట్ చేయలేదు. ఈ నేపథ్యంలో పక్కింటి వాళ్ల ద్వారా భర్త సమాచారం తెలుసుకునేందుకు ఆమె ప్రయత్నించింది. ఫ్యానుకు ఉరివేసుకొని కిరణ్ కనిపించడంతో స్థానికులు వెంటనే అతని భార్యకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓగా హనీష్



నందిగామ: పట్టణ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా జేవీకె హనీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సతీష్ బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో విజయవాడ సీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హనీష్‌ను నందిగామ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏసీపీ జనార్దన నాయుడును హనీష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వచ్ఛంద ప్రజా సేవకులు వలంటీర్లు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం


వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే స్వచ్ఛంద ప్రజా సేవకులని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వలంటీర్‌లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట సేవలందించిన వలంటీర్‌లను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవా పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వలంటీర్‌లు అందిస్తున్న నిస్వార్థ సేవకు గుర్తింపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏటా సత్కారాలు అందించటం అభినందనీయమన్నారు. ముఖ్యంగా వలంటీర్‌లు అందిస్తున్న సేవలు ఎనలేనివని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ప్రజలకు ఎంత మంచి చేసినా ప్రతిపక్షాలు కుట్రపూరితంగా మాట్లాడుతున్నాయని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ప్రతి పక్షాలు చేస్తున్న విమర్శలకు దీటుగా ప్రజలకు నిజం చెప్పే బాధ్యతను వలంటీర్‌లు తమ భుజ స్కందాలపై మోస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలోని జన్మభూమి కమిటీలు ఏ విధంగా పని చేశాయి.. ప్రస్తుత వలంటీర్ వ్యవస్థ ఎలా పని చేస్తుం ప్రజలకు తెలుసని చెప్పారు. వలంటీర్‌ల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్ రమావత్ కోటి, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీలు షేక్ నాగుల్ మీరా, వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, శీలం రమణారెడ్డి, ఇప్పల సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు నంద్రు సౌజన్య, చెండ్యాల రామకృష్ణ, పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





ఈ నాలుగేళ్ళలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులకు గాను ఖర్చు చేసిన మొత్తము

1	జగనన్న అమ్మ ఒడి	901697000/-
2	జగనన్న వసతి దీవెన	106779870/-
3	జగనన్న విద్యా దీవెన్	356775931/-
4	వైఎస్ఆర్ రైతు భరోసా	1000657500/-
5	వైఎస్ఆర్ సున్న వడ్డీ పంట రుణాలు (రైతులు)	24677966/-
6	డా॥ వైఎస్ఆర్ ఉచిత పంట బీమా	147672967/-
7	రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	100116043/-
8	వైఎస్ఆర్ 'సున్న' వడ్డీ (ఎస్‌హెచ్‌జిలు)	75846634/-
9	వైఎస్ఆర్ పెన్షన్ కానుక	2731263250/-
10	వైఎస్ఆర్ చేయూత	476550000/-
11	వైఎస్ఆర్ ఆసరా	918975776/-
12	వైఎస్ఆర్ బీమా	114820000/-

13	వైఎస్ఆర్ కాపు నేస్తం	40530000/-
14	వైఎస్ఆర్ నేతన్న నేస్తం	384000/-
15	జగనన్న చేదోడు (రజకులు, టైలర్లు - నాయీ బ్రాహ్మణులు)	23750000/-
16	వైఎస్ఆర్ లా నేస్తం	900000/-
17	వైఎస్ఆర్ వాహన మిత్ర	48560000/-
18	డా.వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా	11727600/-
19	అర్చకులు/ఇమామ్‌లకు ఒక్కసారి ఆర్థిక సహాయం /మౌజమ్స్ /పాస్టర్లు	1660000/-
20	వైఎస్ఆర్ ఈబిసి నేస్తం	45495000/-
23	డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ	129537952/-
24	జగనన్న తోడు	1231131/-
25	జగనన్న ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు	5196300000/-

1.	ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్	50.00 కోట్లు
2.	పంచాయతీరాజ్	82.86 కోట్లు
3.	పి.యం.జి.ఎస్.వై. రోడ్లు	6.70 కోట్లు
4.	నాడు - నేడు	58.01 కోట్లు
5.	సచివాలయాలు - హెల్త్ సెంటర్లు, ఆర్‌బికే కేంద్రాలు	41.49 కోట్లు
6.	ఆర్‌డబ్ల్యు ఎస్ డిపార్ట్‌మెంట్	33.28 కోట్లు
7.	మునిసిపల్ ఇంజనీరింగ్ వర్క్స్	90.20 కోట్లు
8.	ఇరిగేషన్	98.42 కోట్లు
9.	హెల్త్ డిపార్ట్‌మెంట్	6.0 కోట్లు
10.	హోసింగ్ డిపార్ట్‌మెంట్	60.80 కోట్లు
11.	స్త్రీ, శిశు సంక్షేమశాఖ	28.86 కోట్లు
12.	ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్	5.36 కోట్లు
13.	జగనన్న ఇల్లు లబ్ధిదారుల సంఖ్య :13,369 గృహాలు	

జగనన్న సంక్షేమ పథకల ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని లబ్ధిదారులకు నేరుగా జమచేసిన మొత్తం రూ. 1,245,59,08,620/-
అక్షరాల పన్నెండు వందల నలభై ఐదు కోట్ల యాభై తొమ్మిది లక్షల ఎనిమిది వేల ఆరువందల ఇరవై రూపాయలు

జగనన్న ప్రభుత్వంలో మన జగ్గయ్యపేట నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి పనుల విలువ మొత్తం రూ. 561,98,00,000/-
అక్షరాల ఐదు వందల అరవైఒక్క కోట్ల తొంభై ఎనిమిది లక్షల రూపాయలు

కృష్ణానదిపై ముక్త్యాల వద్ద బ్రిడ్జ్ నిర్మాణానికి 60 కోట్లు మంజూరు
టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి 2.5 కోట్లు మంజూరు